# కిటికీ

గాలికి కిటికీ రెక్క తెర్చుకుంది. బోల్టు వూడిపోయిన కిటికీ రెక్క.... ఎన్నో దశాబ్దాలుగా ఎండకు ఎండి, వానకు తడిసి, చితికిపోయిన చెక్క, తెరుచుకునేటపుడు వింతశబ్దం చేసే తుప్పు పట్టి కొద్దిగా విరిగిన బందులు.

యిప్పటివరకూ అనుభవిస్తున్న నిశ్శబ్దాన్నీ, ప్రశాంతతనీ భంగపరుస్తూ వెల్తురు మంచంమీద పడింది. నీరసంగా లేచి కిటికీ రెక్క మూశాను... అయిష్టంగా మూల్గుతూ మూసుకుంది.

ఇలా చేయడం పదోసారి.

మరలా ఎప్పటికి మల్లే నాకిష్టమైన చీకటి.. అస్పష్టంగా గదిలోని వస్తువులు నిశ్శబ్దం పులుముకుని కన్పిస్తున్నాయి.

కళ్ళు మూసుకున్నాను. బాగా నీరసంగా ఉంది. శరీరంలోంచి శక్తంతా ఎవరో పిండివేసినట్లు.....

ఉధృతంగా ఆలోచనలు.. శరీరాన్ని ఆక్రమించుకునే విషజ్వర క్రిముల్లా...

ఆ రాత్రి గుర్తుకొస్తోంది. తీయగా - మధురంగా .. ఓ పదిరోజుల క్రితం - యిక్కడే యిదే ఇంట్లో - చీకటిలో... నేను తాకిన లేత పెదవులు... స్వచ్ఛమైన - సుకుమారమైన......

"నిద్రపోతున్నారా" ఉలికిపడి చూశాను. అర్థాంగి.. మొదట మసక మసగ్గా.. తర్వాత స్పష్టంగా కన్పిస్తోంది.

"ఎప్పుడూ చీకట్లో ఏమిటండీ"

స్విచ్ వేసింది రాజ్యం.

గదినిండా తెల్లటి వెల్తురు - రాజ్యం మనసులా.

పదిహేనేళ్ళ సాహచర్యం - ముడిపడి - బలపడి - ప్రతిక్షణమూ పెరిగే అద్వితీయమైన అనుబంధం.

"మీ ఆలోచనలు మానరు కదా. పొద్దస్తమానూ ఏవుంటాయండీ ఆలోచించడానికి" విసుక్కుంటూ రాజ్యం బెడ్‌మీదికొచ్చి కూచుంది. నుదుటి మీద చేయి వేసింది. చల్లగా ఐస్ పెట్టినట్లు..

"అమ్మో. మండిపోతోంది జ్వరం"

ధర్మామీటర్ తీసుకొచ్చింది. నోరు తెరిచి నాలిక కింద ధర్మామీటర్ పెట్టుకున్నాను. రాజ్యం తదేకంగా గోడనున్న గడియారం వైపు చూస్తోంది. నల్లటి డయల్ మీద తెల్లటి అంకెలని తాకుతూ కదుల్తోంది సన్నటి సెంకడ్ల ముల్లు. ప్రస్తుతానికి ఏ ఆలోచనా రావటం లేదు. రాజ్యంవైపు చూస్తూ అలా స్తబ్ధంగా పడుకున్నాను.

ధర్మామీటర్ బైటికి తీసి లైట్ వెల్తురికి ఎదురుగ్గా పెట్టి చూస్తోంది రాజ్యం. ఆ వెడల్పాటి కళ్ళు ధర్మామీటర్‌లో బారుగా సాగిన పాదరసం గీత అంచుకోసం వెతుక్కుంటున్నాయి.

"నూటమూడు"

కళ్ళు పెద్దవి చేసి చెప్పింది రాజ్యం. నిన్నరాత్రి నూటనాలుగు. ఉదయం వందకు తగ్గి మధ్యాహ్నానికి పెరిగి రాత్రికి నూటనాలుగో - నూటఅయిదో ఉంటుంది జ్వరం.

శరీరంలోని రక్తం మరుగుతున్నట్లు ఆవిర్లు వస్తున్నాయి. జీవకణాలు ఒకటొకటిగా విస్ఫోటంతో పగిలిపోతున్నట్లు శరీరం నిండా బాధ.

టైం రెండు దాటినట్లుంది. రాజ్యం హడావిడి పడిపోతోంది. ఉదయం డాక్టర్ యిచ్చిన నాలుగు రకాల మందులు తెచ్చి ముందు పడేసింది. పాలు తీసుకురావడానికి కిచెన్‌లోకి వెళ్ళింది. నేను ఒంటరిగా గదిలో మిగిలిపోయాను.

ఈ నెలలో జ్వరం రావటం యిది రెండోసారి. మొదటిసారి వచ్చినప్పుడు రెండ్రోజుల్లో తగ్గిపోయింది. యీసారి - అసలిలా నెలలో రెండు సార్లు ఎందుకొస్తుందో... జ్వరం తగ్గాక

బ్లడ్‌టెస్ట్ చేయించుకోమని డాక్టర్ చెప్పాడు. వయసు నలభయ్‌లో పడింది. జాగ్రత్తగా వుండకపోతే కష్టం.

రాజ్యం పాలగ్లాస్‌తో వచ్చింది. రెండు గొట్టాలు, రెండు టాబ్లెట్లు, ఈ డాక్టర్లకు ఏం జ్వరం ఏమిటో తెలియదనుకుంటా. పదిరకాల మందులు యిచ్చేస్తారు. అంత మాత్రానికి డాక్టర్లు దేనికి? ఏదో ఒహటి పనిచేయక చస్తుందా -

"ఆలోచించకుండా విశ్రాంతి తీసుకోండి. నేను కిచెన్‌లో కెళ్తున్నాను"

రాజ్యం వెళ్తోంది.

"లైట్ తీసివేద్దూ"

ఆగి- ఓసారి వెనక్కి తిరిగి చూసి - స్విచ్ ఆఫ్‌చేసి వెళ్ళిపోయింది.

చీకటి - మసగ్గా ......

మా తాతల నాటినుంచీ వారసత్వంగా వస్తుందీ యిల్లు. నాకీ యింటితో ఉన్న అనుబంధం నలభయ్యేళ్ళది. ఇదే గదిలో - కొత్తగా కాపురానికొచ్చిన రాజ్యం - కొత్త కొత్త - వింత వింత రుచులు చూపించింది. అన్నాళ్ళ తర్వాత మరలా మొన్న పదిరోజుల క్రితం - ఇరవై పూర్తిగా నిండని మరదలితో.. ఎంతో కొత్తగా - నాకు మరలా యవ్వనం వచ్చినట్లు - నేను ఓ యిరవై యేళ్ళు వెనక్కి వెళ్ళిపోయినట్లు - శరీరంలో జలదరింపు - తొట్రుపాటు - టీనేజ్ బాయ్ మొట్టమొదటి సారి స్త్రీ శరీరాన్ని క్యూరియాసిటీతో - యాంగ్జయిటీతో - ఉద్రేకంతో... వేగంగా వణికే చేతుల్తో తాకుతున్నప్పటి అనుభూతి.

పాపం రాజ్యం చాలా సత్తెకాలం మనిషి. ఆడవాళ్ళలో ఇంకా యిలాంటి స్త్రీలుండబట్టే నాలాంటివాళ్ళ ఆటలు సాగుతున్నాయి. నాకున్న ఈ వీక్‌నెస్.. బలహీనతకు లొంగివొంగి సలాం చేయడం.. రాజ్యం నేనూ చాలాసార్లే ఘర్షణ పడ్డాం - ఈ విషయంలో. పిల్లలు కొంత పెద్దవాళ్ళయ్యాక రాజ్యం పోట్లాడటం మానుకుంది. నాకూ వయసు పైబడి - కొంత తగ్గింది.

"శుభ్రమైన గాలి కూడా రాకుండా తలుపులన్నీ బిగిస్తే ఎలాగండీ" రాజ్యంలోపలికొస్తూనే కిటికీరెక్క తెరిచింది.

సాయంత్రపు నీరెండ కిటికీలోంచి గదిలోకి జొరబడింది.

కళ్ళు చిట్లించి కిటికీవైపు చూశాను.

కిటికీ గర్భంలోంచి వెల్తురు అపుడే పుడ్తున్నట్లు రక్తంలాంటి అరుణిమను పులుముకుని- ఈ యింటిమీద నాకున్న ఇష్టంకొద్దీ దీన్ని మార్చటమో, రీమోడల్ చేయటమో నచ్చదు నాకు. ఈ గోడలు - వెలిసిపోయిన రంగులూ - విరిగిన తలుపులూ - కిటికీలు - నాకిలానే ఇష్టం.

" ఇదేం టేస్ట్ బాబూ" అంటూ రాజ్యం బాధపడిన సమయాలెన్నో. అపుడు నేను నవ్వేసి "పిచ్చిదానా - రేపు నీవూ పళ్ళూడి పోయి మన కిటికిలా తయారయినపుడు నిన్నిలానే ఎప్పటిలా ప్రేమిస్తూ వుండటం సాధ్యపడేది యీ టేస్ట్ వల్లనే" అంటే "ఔను కామోసు" అన్నట్లు కళ్ళు పెద్దవిచేసి "పోదురూ" అంటూ జారుకుంటుంది రాజ్యం.

రాజ్యంలోని డెడికేషన్ - సిన్సియారిటి - ఇన్నోసెన్స్ చూసినపుడు మోసం చేస్తున్నానని బాధవేస్తుంది. ఒకరా యిద్దరా... వ్యసనంలా - అతి వేగంగా అల్లుకునే క్యాన్సర్ కణంలా, పోనీ ఇంత వయసొచ్చాక కూడా - ఛీ... ఎంత పశుత్వం - అభంశుభం తెలియని పిల్లని - నాకున్న రిచ్ ఎక్స్‌పీరియన్స్‌తో, ఉత్తేజపరచి - ఉన్మత్తురాల్ని చేసి - ప్చ్... ఎంత అమానుషం.

నిద్ర రావటం లేదు. కళ్ళు అగ్నిగోళాల్లా మండుతున్నాయి. కణతలు పగిలిపోతున్నంత బాధ.

ఏవిటి జీవితం ? క్షణికమని తెలిసీ - భ్రమాజనితమని తెలిసీ - ఎందుకిలా ఈ నశ్వరమైన సుఖాల కోసం ప్రాకులాడటం - కొత్తదనం కోసం ఓ కన్నెపిల్ల జీవితంతో ఆడుకోవడం.. మగవాడి చేతి స్పర్శ మొదటిసారిగా అనుభవిస్తూ రసానుభూతిలో లొంగే శరీరకణాలు. ఆ అనుభవం ఎలా వుంటుందో చూడాలన్న ఉత్సుకత కొద్దీ లొంగే - మెదడు కణాలు - ఆడపిల్లల్లోని ఈ బలహీనతను ఎక్స్‌ప్లాయిట్ చేసి.. ఏవిటి సాధించేది? ముందు జీవితమంతా భయంకరమైన మానసిక క్షోభకు ఆ పిల్లను గురిచేయటమే..

తుచ్ఛమైన - హేయమైన కోరికలతో జీవితాన్ని నికృష్టం చేసుకోకుండా వరంలా దొరికిన

ఈ మానవ జీవితాన్ని మహోన్నత ఆశయాలతో - ఉత్కృష్టమైన ఆచరణతో నింపి - అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచి - ఓ సార్థకతని కలిగించటంలోవున్న తృప్తి, ఈ భోగభాగ్యాల్లో ఉండదు. పశ్చాత్తాపం వచ్చేస్తోంది. ఎన్నేళ్ళు వ్యర్థంగా - నిరర్థకంగా గడిపేశానో - మనో చాంచల్యంతో ఎన్నెన్ని ఘోరాలు చేశానో - నరకానికి నా పేరు ఎపుడో రికమెండ్ అయి వుండాలి. ఆఫీస్‌లో అవసరార్థం వచ్చిన వాళ్ళను మభ్యపెట్టి - బెదిరించి- ఏడ్పించి - పదిసార్లు తిప్పించి - ఫైళ్ళు పెండింగ్‌లో పెట్టి - అక్రమమైన వాటిలో సక్రమమేనని రాసి శాంక్షన్‌లు యిప్పించి... సక్రమమై వాటిలో అడ్డమైన రాతలు రాసి - ఆపివేసి.. ఇలా సంపాయించిన డబ్బు - ఓహ్ .. భగవాన్ - నా పాపాలకు నిష్కృతి లేదు.

కళ్ళు బాధగా - భారంగా తెరిచాను. ఎదురుగా రాజ్యం.

తదేకంగా నావైపే చూస్తోంది.

విస్మయంగా - వినోదంగా - విస్ఫారిత నేత్రాలతో

నేను తనకెపుడూ వింతగా - కొత్తగా - భయం కలిగించేలా ఆలోచిస్తూ కన్పిస్తానట.

"బ్రెడ్ కావాలా" ఎంత మృదువుగా - మధురంగా ఉంటుంది రాజ్యం గొంతు! స్వరంలో ప్రేమను రంగరించి పలుకుతుంది.

దగ్గిరగా కూచోమని చెప్పాను. వచ్చి బెడ్ పక్కన కూచుంది.. తనచేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను.

"పిచ్చి రాజ్యం"

కళ్ళు మూసుకున్నాను. నేనెంత అదృష్టవంతుడిని!

"టెంపరేచర్ చూస్తానుండండని" రాజ్యం ధర్మామీటర్ పట్టుకొచ్చింది. నూటఐదు - డాక్టర్ ఉద్దేశంలో ఇదేదో టిపికల్ వైరల్ ఫీవరని.. టి.బి. బ్రోంకైటిస్ ఉన్నా ఇలా తరచూ జ్వరం రావచ్చుట. నేనెక్కడో చదివాను - క్యాన్సర్ ఉన్నా ఇలానే ఉంటుందని.

చచ్చిపోతానేమో - విషజ్వరం వచ్చి చనిపోయిన వాళ్ళు బోల్డుమంది ఉన్నారు. నాకు చావంటే చచ్చేంత భయం - చావు తర్వాత ఏవుంటుందో - అనంతమైన శూన్యం - ఆ

శూన్యాన్ని తల్చుకుంటునే భయం. యిన్నాళ్ళుగా ప్రేమించి - పోషించిన ఈ శరీరం - ఆలోచనలూ - ఆర్జించిన సంపదా - హితులూ-ప్రియురాళ్ళూ... వీళ్ళందర్నీ మరలా చూడగలిగితే.... ఆ లోకం అంటూ ఏదో ఒకటుండి - ఆత్మ అనేది పరిభ్రమిస్తూ - తన వాళ్ళను చూసుకుంటూ ఉంటే చాలు. అపుడింత భయం ఉండదు - ప్చ్ - ఎంతాశ! ఆత్మ శరీరాన్ని వదిలిపోయినా - యింకా నేనూ, నా వాళ్ళనే భవబంధాల్లోనే బందీగా ఉండాలనుకుంటాడు మనిషి - ఎంతటి స్వార్థం!

చావు తప్పదని తెలిసీ ఎందుకీ ఆరాటం - ధనాన్ని - సుఖాన్ని స్వంతం చేసుకోవాలన్న తపన - అసలేమిటి సుఖం అంటే...... మెదడులోని నరాల్లో ఓ సన్నటి కదలిక. రసాయనిక ద్రవాల్లో క్షణకాలం మాత్రం జరిగే ప్రక్రియ - శరీర కణాల్లో జ్వలించి - వ్యాకోచించి - విజృంభించి - సంకోచించి - సంతృప్తిపడి.. అనంతానంత విశ్వంలో కోటాను కోట్ల నక్షత్ర సముదాయాల్లో ఓ పరమాణువులా ఉన్న ఈ గ్రహం మీద సూక్ష్మాతి సూక్ష్మమైన ప్రాణినైన నేను..... ఏదీ అస్థిత్వం? ఈ జీవిత సత్యాన్ని తెల్సుకున్నారు కాబట్టే మహర్షులూ -మహనీయులూ ప్రాపంచిక సుఖాల్ని పరిత్యజించి మోక్షాన్ని వెతుక్కున్నారు... వాళ్ళు ధన్యజీవులు.

కిటికీలోంచి చలిగాలి వీస్తోంది. వంటినిండా కప్పుకున్న దుప్పటి కూడా ఆపలేనంత - లేచి కిటికీ తలుపులు మూశాను. రాజ్యాన్ని పిలుద్దామనుకున్నాను - భోంచేస్తున్నట్లుగా ఉంది. నేనే లేచి లైట్ తీసేశాను.

చీకటి - బెడ్‌ని వెతుక్కుంటూ వెళ్ళి పడుకున్నా - పక్కకు ఒత్తిగిలి - దిండుని చేత్తో తడిమి - తలకిందికి సరిగ్గా లాక్కున్నాను. దిండు మెత్తగా ఉంది. వక్షంలా - ఇదే చీకటిలో కింద చాపమీద పడుకున్న మరదల్ని - ప్చ్ ఈ రాజ్యమే మంచం మీద లేకుండా ఉంటే - ఎంతటి రసవత్తరమైన ఛాన్స్ పోయిందో...

చీకటిలో మెరిసే మరదలి కళ్ళు - మధురమైన పెదవులు - చేతినిండా యిమిడే గుండ్రటి తెల్లటి వక్షం - యివి తప్ప ముందుకు సాగే అవకాశమే లేకపోయింది - ప్రథమ సమాగమంలోని తీయటి బాధకు తాళలేక అరిస్తే - రాజ్యం మేలుకుంటుందన్న భయం.

ఆ రెండో రోజే మరదలు వూరెళ్ళిపోయింది.

వెళ్ళేముందు తీయటి ముద్దిచ్చి...

"అవి నావి - భద్రంగా దాచుకో" అంటే సిగ్గుపడి - తలదించుకున్న స్నిగ్ధ - ముగ్ధ - నా మరదలు. తను వెళ్ళి వారం దాటిపోతున్నా ఆ శరీరంలోని నునుపూ - కళ్ళలోని తళుకూ - పంటి పదునూ - మరుపుకు రావటం లేదు. గట్టిగా వూపిరాడకుండా కౌగిలించుకుంటే - కోరికతో బుసలు కొడ్తున్నట్లు నిశ్వాసలు - చేతులు ఎక్కడో తాకిన ప్రతిసారీ తీయగా చేసిన శబ్దాలూ - తమకంతో నన్నల్లుకుని - చుట్టుకుని - పెనవేసుకుని - మురిపించిన మెరుపుతీగలాంటి ఆ లేతశరీరం - అందులో గుబాళించే పరిపూర్ణమైన ఫ్రెష్‌నెస్.....

వళ్ళు పేలిపోతున్నట్లుంది జ్వరంతో. కళ్ళు తెరిచి చూశాను - మూసినా తెరిచినా ఒకటే - చీకటి, ఏవీ కనిపించడం లేదు. చాపమీద రాజ్యం బరువుగా తీస్తున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలు విన్పిస్తున్నాయి. రాత్రి ఎప్పటికోగాని నిద్ర పట్టలేదు నాకు.

జ్వరం ఓ వారం రోజులు పీడించి, పిప్పిచేసి - తగ్గిపోయింది. ఇప్పుడు రక్తం నిండా యాంటీ బయాటిక్స్ ప్రవహిస్తున్నట్లు - నీరసం నరాల నిండా నిండిపోయినట్లు - నిన్న కొద్దిగా ఎంగిలిపడ్డాను.

ఉదయం తొమ్మిది కావస్తోంది. వెచ్చగా ఎండ కిటికీలోంచి పడ్తోంది. ఈరోజు ఆఫీస్ కెళ్ళాలి. ఈ ఎండ ఎంత చిరాగ్గా ఉందో - బెడ్‌మీద కూచుని కిటికీ మూశాను.

"రాజ్యం - త్వరగా కానీయ్ - టైం అవుతోంది" సాక్స్ వేసుకుంటూ వంటగదిలోకి విన్పించేట్లు అరిచాను.

నా దగ్గిర పెండింగ్ ఉండిపోయిన కేసులు గుర్తొచ్చాయి. వారం శెలవ - ఎంత నష్టమో - మందులకు అదనపు ఖర్చు - ఎక్స్‌రేలకనీ, బ్లడ్‌టెస్ట్‌లకనీ బోల్డు ఖర్చు - ఈ మొత్తం కలిపి ఈ ఒక్కరోజే సంపాయించాలి.

అలా అనుకోగానే వుత్సాహం వచ్చుసినట్లయింది వంట్లో - ఈలవేస్తూ బూట్లు వేసుకున్నాను.

రాజ్యం టిఫిన్ తీసుకుని వచ్చింది.

"నీ చెల్లెలికి టెలిగ్రాం ఇస్తున్నానోయ్ - రమ్మని"

"ఎవరు - చివరిదా - పెళ్ళి వారమే కదండి అయింది"

గాలికి కిటికీ రెక్క మొదట టపటపా కొట్టుకుంది. ఆ తర్వాత ఒక్కసారిగా శబ్దం చేస్తూ తెర్చుకుంది.

విసుగ్గా చూశాను. ఇదో వ్యాయామం అయిపోయింది నాకు. ఎండ - వెల్తురూ - గదినిండా మండుతూ -

ఇల్లంతా వెతికి మంచి పురితాడు తీసుకొచ్చాను. కిటికీ రెక్కకున్న హుక్‌లో తాడు దూర్చి కిటికి కున్న కమ్మీల వైపుకు లాగి గట్టిగా కమ్మీలకేసి కట్టేశాను. వూడిపోకుండా రెండు మూడు ముళ్ళు కూడా వేశాను. ఇంక తెర్చుకోదీ కిటికీ.

రాజ్యం అక్కడే నిలబడి వుంది. వింతగా, ఆశ్చర్యంగా నా వైపే చూస్తూ.

"అది కాదోయ్... మొన్న ఇక్కడ పరీక్ష రాసిందిగా - ఇక్కడే ఉండి ప్రయత్నాలు చేస్తేనేగాని పాస్‌కావడం కష్టం. ఈ రోజుల్లో ఉద్యోగాల కోసం జరిగే పరీక్షల్లో అటువంటి ప్రయత్నాలేమీ చేయకపోతే నిరుద్యోగ పర్వమే గతి!"

తనులేకుండా మీరే ప్రయత్నించ వచ్చుగా అంటుందేమోనని సమాధానం రెడీగా ఉంచుకుని రాజ్యం వైపు చూశాను.

"మీ ఇష్టం" అంది.

ఓ సారి కిటికీవైపు - దానికి కట్టిన తాడు వేపూ గర్వంగా చూసుకుని హుషారుగా ఆఫీసుకి బయల్దేరాను. దార్లోనే టెలిగ్రాఫ్ ఆఫీస్ కూడా ఉంది.

● స్వాతి సపరి వారపత్రిక 29 జనవరి, 1988 ●